చెస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

రెబ్బెన, మే 6 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరాజ్ ఉర్ రెహమాన్, ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఈగ కనకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్ సంపత్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడిగా బోగే ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా కల్పన, జాయింట్ సెక్రటరీగా ఎం రవీందర్, ట్రెజరర్ పీ శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం శృతిక, డీ హర్షితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ఐటీఐ కళాశాల నిర్వహణపై ఫిర్యాదు

నస్పూర్, మే 6 : బెల్లంపల్లిలోని సెయింట్ లూయిస్ ఐటీఐ కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐటీఐ మంచిర్యాల జిల్లా కన్వీనర్ చందర్‌కు సోమవారం టీవీయూవీ, జేవీఎస్ నాయకులు వినతి పత్రం అందించారు. నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, చేరాల వంశీ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బెల్లంపల్లిలో సెయింట్ లూయిస్ ఐటీఐ కళాశాల కొనసాగుతున్నదని, మౌలిక వసతులు కల్పించడం లేదని ఆరోపించారు. వెంటనే ఈ కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ, తేజ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించవద్దు

నస్పూర్, మే 6 : మంచిర్యాల జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలో వేసవి సెలవుల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఈవో యాదయ్య తెలిపారు. తరగతులు నిర్వహించినట్లు తమ దృష్టికి వస్తే యాజమాన్యాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలి

- బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు
- ఇంటింటా జోరుగా ప్రచారం

దండేపల్లి, మే 6: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలని మంచిర్యాల యువ నాయకుడు, నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం దండేపల్లి మండల కేంద్రంతో పాటు నెల్కివెంకటాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాటలను నమ్మవద్దన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, స్థానిక నాయకులు బొమ్మెన మహేశ్, గొట్ల భూమన్న, దొరిశెట్టి కిరణ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను వివరిస్తూ ప్రచారం..

మందమర్రి, మే 6: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్, బీజేపీ మోసపూరిత హామీలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు సుభాష్ నగర్, 6వ వార్డు నార్లాపూర్, ఒకటవ జోన్ కాలనీల్లో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500, కల్యాణలక్ష్మి,

శ్రీరాంపూర్ : నస్పూర్ 22వ వార్డులో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

షాదీ ముబారక్ పథకాల్లో తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని వివరించారు. మంచిర్యాల జిల్లాను రద్దు చేసే కుట్ర పన్నుతున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్, మహిళా, యూత్, సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో..

శ్రీరాంపూర్, మే 6 : మాయ మాటలతో మోసం చేసిన కాంగ్రెస్‌ను ప్రజలు ఓడించి తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం సాయంత్రం నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో 22వ వార్డు విద్యానగర్‌లో కౌన్సిలర్లు వంగ తిరుపతి, కుర్మిల్ల అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటా ప్రచారంలో పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్యతో పాటు నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకులు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి పొనగంటి సత్తయ్య పాల్గొన్నారు. మతతత్వ రాజకీయాలు చేస్తున్న బీజేపీ, మోసం చేసిన కాంగ్రెస్‌ను ఓడించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు అన్వేశ్‌రెడ్డి, పొగాకు రమేశ్, వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గుంట జగ్గయ్య, మోహన్, భానుచందర్, రవిగౌడ్, జనార్దన్, సంపత్, శంకర్, సమ్మయ్య, వెంకటేశ్వర్లు, తిరుమల్, కాటం రాజు, దగ్గుల మధు, మెడం తిరుపతి, తిప్పని రామయ్య పాల్గొన్నారు.

ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలి

రెబ్బెన, మే 6 : ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీ తో గెలిపించాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గజ్జల సత్యనారాయణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, బీఆర్ఎస్ మహిళా మండలాధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, మాజీ సర్పంచ్ అహల్యాదేవి, మాజీ ఉపసర్పంచ్ బొమ్మినేని శ్రీధర్, నాయకులు పల్లె రాజేశ్వర్‌రావు, వినోద్‌జైస్వాల్, దుర్గం రాజేశ్, తక్కలపల్లి రాజేశ్వర్‌రావు, వినోద్‌జైస్వాల్, దుర్గారావు పాల్గొన్నారు.

వాంకిడి మండలంలో..

వాంకిడి, మే 6 : మండలంలోని సరాండి, నార్లపూర్ గ్రామాల్లో జడ్పీటీసీ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటేసి ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ జాబోరే పెంటు, వాంకిడి మాజీ సర్పంచ్ బండే తుకారాం, బాంబర మాజీ ఎంపీటీసీ వినోద్, మాజీ సర్పంచ్ దుర్గం కమలాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దండేపల్లి : నెల్కివెంకటాపూర్‌లో ప్రచారం చేస్తున్న విజిత్‌రావు

మందమర్రి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ప్రచార ర్యాలీ

రెబ్బెన : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సింగరేణి

ఓసీపీల్లో పని వేళలు మార్చాలి

సీఎండీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, మే 6 :సింగరేణిలోని ఓసీపీల్లో కార్మికుల పనివేళలు మార్చాలని కోరుతూ గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ సోమవారం సీఅండ్ఎండీ బలరామ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కార్మికులు అనారోగ్యానికి గురి కాకుండా ఉండేందుకు విధుల సమయాలు సవరించాలని కోరారు. యాజమాన్యం సవరించిన సమయాలపై కార్మికుల్లో తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. మొదటి బదిలీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు లంచ్ సమయం లేకుండా, 2వ బదిలీ సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్వహించాలని కోరారు. దీనిపై సీఎండీ బలరామ్ అన్ని ఏరియాల జీఎంలతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా చర్చించి ఉత్పత్తి తగ్గకుండా సర్దుబాటు చేసుకోవడానికి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల విధుల్లోని ఉద్యోగులకు ఆన్‌డ్యూటీగా పరిగణింపు..

సింగరేణి ఉద్యోగులు, మినిస్ట్రీయల్ స్టాఫ్, సెక్యూరిటీ సిబ్బంది అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల విధుల్లో కొనసాగితే వారికి ఆన్ డ్యూటీగా పరిణించాలని కోరిన మేరకు యాజమాన్యం అంగీకరించిందని చెప్పారు. ఎన్నికల విధుల్లో హాజరైతే ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే విధంగా సింగరేణి ఉద్యోగులకు కూడా వర్తింప చేసేందుకు సీఎండీ అంగీకరించారని తెలిపారు.

అస్వస్థతకు గురై బాలుడి మృతి

కాసిపేట, మే 6 : కాసిపేట మండలం పెద్దనపల్లి న్యూ కాలనీ శివారులోని మామిడితోటలో దుర్గేశ్ రామ్ కరణ్(5) మృతి చెందినట్లు ఎస్ఐ వీ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... మధ్యప్రదేశ్‌కు చెందిన రామ్ కరణ్ రామ్ ప్రసాద్, భార్య, ముగ్గురు పిల్లలతో పెద్దనపల్లి శివారులోని మామిడితోటలో కూలి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మామిడికాయలు తెంపి రాత్రి పడుకున్నారు. సోమవారం ఉదయం నిద్రలేచి చూసే సరికి ఐదేళ్ల చిన్న కుమారుడు దుర్గేశ్ రామ్ కరణ్ కుడిచేతి మట్టపై వాపు కనిపించే సరికి వెంటనే బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు అక్కడి నుంచి మంచిర్యాల దవాఖానకు తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విష పురుగు కుట్టడం, అనారోగ్య సమస్యతో మృతి చెంది ఉంటాడని తండ్రి రామ్ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

సెల్ టవర్‌పై నుంచి దూకి ఒకరి ఆత్మహత్య

కౌటాల, మే 6 : గురుడుపేట గ్రామానికి చెందిన బోగారపు భీంరావ్(35) సెల్ టవర్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు. భీంరావుకు అదే గ్రామానికి చెందిన సౌజన్యతో వివాహం జరిగింది. గత కొద్ది రోజుల నుంచి భార్యభర్తలు గొడవలు పడుతున్నారు. భీంరావ్ నిత్యం మద్యం తాగి ఇంట్లో గొడవ చేయడంతో భార్య సౌజన్య తల్లి గారింటికి వెళ్లింది. ఈ క్రమంలో అతిగా మద్యం తాగిన భీంరావ్ ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటి ముందు ఉన్న సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నం చేయగా గ్రామస్తులు గమనించి దింపారు. తిరిగి అర్ధరాత్రి 1 గంట సమయంలో సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని తల్లి కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బీఆర్ఎస్‌కే మాదిగల మద్దతు

- ఎమ్మార్పీఎస్ (టీఎస్) జిల్లా ఇన్‌చార్జి మధురాజ్

మాట్లాడుతున్న తగరం మధురాజ్

చెన్నూర్, మే 6: త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకే మాదిగల సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ (టీఎస్) ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ అన్నారు. సోమవారం చెన్నూర్‌లో ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎస్సీ వర్గీకరణ చేయకుండా మాదిగ కులస్తులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. మాదిగల హక్కులను బీఆర్ఎస్‌తోనే సాధించుకోవచ్చని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ 12 నుంచి 14 సీట్లు సాధించడం ద్వారా ఎస్సీ వర్గీకరణ సులువుగా జరుగుతుందని తెలిపారు. మాదిగలంతా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం మాదిగలంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ (టీఎస్) నాయకులు శ్రావణ్, ప్రశాంత్, అశోక్, కే రాజు, నరేందర్, శ్రీనివాస్, పోశం, రాజు, సురేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత

మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత

కాసిపేట, మే 6 : ప్రజలకు అందుబాటులో ఉండే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సతీమణి, ఎల్ఎం కొప్పుల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ స్నేహలత కోరారు. సోమవారం కాసిపేట మండలంలోని ముత్యంపల్లిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి అధ్యక్షతన మండలంలోని ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించే, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొప్పుల ఈశ్వర్ గెలుపుతో ఈ ప్రాంతంలో అనేక సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, చంద్రమౌళి, మాజీ సర్పంచ్ ఆడె బాదు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, రాంటెంకి వాస్‌దేవ్, జాడి రాంచందర్, అక్కెపల్లి బుగ్గ రాజు, లంక లక్ష్మణ్, మచ్చ అనిల్, కరీం, మడిపల్లి తిరుపతి, శంకర్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
I, KARAWADIA DEVAN KUMAR PATEL S/o. KARAWADIA KISHORE KUMAR R/o. 4-2-345/1, Ranisatiji Colony, Adilabad is hereby declare that hence I shall known as **"KALAVADIYA DEVAN KUMAR"** as per all id proofs holding Passport No.N1428342 Dt. 29.07.2015 to 28.07.2025 issued at Hyderabad. Hence Declared.

CHANGE OF NAME
I, PATEL PRIYA W/o. KALAVADIYA DEVAN KUMAR R/o. H.No. 4-2-345/1, Ranisatiji Colony, Adilabad is hereby declare that hence I shall be known as **"KALAVADIYA PRIYA"** By virtue of Marriage Holding Passport No. H5156825 Dt.28.08.2009 To 27.08.2019 Issued at Hyderabad Hence Declared.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'జిల్లాలు కుదిస్తామనడం సరికాదు'

కాగజ్‌నగర్, మే 6 : ప్రజల సౌకర్యార్థం గత కేసీఆర్ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లాలను కాంగ్రెస్ సర్కారు కుదిస్తామనడం సరికాదని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ స్పష్టం చేశారు. జిల్లాలు కుదించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఆలోచన విరమించుకోవాలని హితవుపలికారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని నూతన జిల్లాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాను రద్దు చేసిన ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాగా చేస్తే మారుమూల ప్రాంతంలోని మండల ప్రజలు ఇబ్బందులు పడుతారని తెలిపారు. ప్రజలకు ఉపయోగకరమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై జిల్లా కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు నారాయణ, పూర్ణచందర్ రావు, రమణయ్య, నాగేశ్వర్ రావు, రామయ్య, ఉపేందర్, వాహబ్ పాల్గొన్నారు.

'నీట్' బాగా రాయలేదని విద్యార్థి ఆత్మహత్య

ఇంద్రవెల్లి, మే 6 : ఏమాయికుంట పంచాయతీ పరిధి గలియబాయి తండాకు చెందిన సనత్‌కుమార్(17) నీట్ పరీక్ష బాగా రాయలేదని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగ్నే డిగాంబర్-గీత దంపతుల కొడుకు కాగ్నే సనత్‌కుమార్ ఆదివారం ఆదిలాబాద్‌లోని ఓ పరీక్షా కేంద్రంలో నీట్ పరీక్ష రాశాడు. బాగా రాయకపోవడంతో ఉత్తీర్ణత సాధిస్తానో లేదో అని మనస్తాపం చెందాడు. సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన ఊపిరితో ఉండగా.. కుటుంబ సభ్యులు గమనించి, ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా, మార్గ మధ్యంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు

ఓటేసిన మరుసటి రోజే..వృద్ధురాలి మృతి

ఇంటి వద్ద ఓటు హక్కును వినియోగించుకున్న మల్లక్క

కోటపల్లి, మే 6 : పార్లమెంట్ ఎన్నికల్లో హోమ్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధురాలు 24 గంటలు గడవకముందే మరణించడం విషాదం నింపింది. భీమిని మండలంలోని కర్జీ భీంపూర్ గ్రామానికి చెందిన కటకం మల్లక్క(83) నడవలేని స్థితిలో ఉన్నది. ఆదివారం గ్రామానికి వెళ్లిన ఎన్నికల అధికారులు ఆమెను ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. ఇంటి వద్దనే మల్లక్క ఓటు హక్కును వినియోగించుకున్నది. సోమవారం సాయంత్రం ఆమె మరణించడం పలువురిని కలిచివేసింది. 83 సంవత్సరాల వయస్సులో తన బాధ్యతను మరవకుండా ఓటు హక్కును వినియోగించుకొని తుది శ్వాస విడిచిన మల్లక్క ఓటు హక్కు ప్రాధాన్యతను చాటింది

సభ్యులు లేక మండల సమావేశం వాయిదా

సభ్యులు లేకపోవడంతో ఖాళీగా కూర్చీలు

కోటపల్లి, మే 6 : కోటపల్లి మండల సర్వసభ్య సమావేశానికి సభ్యులెవరూ హాజరుకాకపోవడంతో వాయిదా పడింది. కోటపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా, ఎన్నికల కోడ్ కారణంగా సభ్యులు దూరంగా ఉన్నారు. సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు కార్యాలయ సూపరింటెండెంట్ లక్ష్మయ్య ప్రకటించారు.

నియామకం

నస్పూర్, మే 6 : తెలంగాణ మున్నూరు కాపు రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులుగా మంచిర్యాలకు చెందిన ముగాల మహేశ్ పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు ఫ్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్ సోమవారం నియామక పత్రం అందించారు.

పీవీటీజీలో ప్రవేశాలు

ఆసిఫాబాద్ టౌన్, మే 6 : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీవీటీజీ గిరిజన గురుకుల పాఠశాల ఆసిఫాబాద్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను మూడో తరగతిలో,4 నుంచి 9వ తరగతి వరకు ఉన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆసిఫాబాద్ పీవీటీజీ గిరిజన గురుకుల ప్రిన్సిపాల్ సురేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో 80, 4వ తరగతిలో 40, 5వ తరగతిలో 41, 9వ తరగతిలో 7 మొత్తం 168 సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పీవీటీజీ తెగలైన కోలం, తోటి, మన్నే(కోలవార్) విద్యార్థులు ఈ నెల 31వ తేదీ లోగా జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకులంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ఆదివాసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పూలాజీ బాబా చూపిన మార్గంలో నడవాలి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కెరమెరి, మే 6 : పూలాజీ బాబా చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం గోయాగాం గ్రామంలో నిర్వహించిన ఆధ్యాత్మిక గురువు శ్రీ పూలాజీ బాబా ధ్యాన కేంద్రం 14వ వార్షికోత్సవానికి ఆమె హాజరయ్యారు. బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, గ్రంథాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్నాపూర్‌లోని బాబా సంస్థాన్‌తో పాటు నియోజకవర్గం లో ఉన్న ధ్యాన కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బాబా సంస్థాన్ అధ్యక్షుడు, బాబా తనయుడు ఇంగ్లే కేశవ్, బీఆర్ఎస్ నాయకురాలు మార్సుకోల సరస్వతి, ధ్యాన కేంద్రం అధ్యక్షుడు లక్ష్మణ్, భగవంతరావ్, పెందోర్ శ్రీనివాస్, భక్తులున్నారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి

- మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి
- కాసిపేట, జన్నారంలో ఫ్లాగ్‌మార్చ్

కాసిపేట : దేవాపూర్‌లో ఫ్లాగ్ మార్చ్‌లో సీఐ, ఎస్ఐ, కేంద్ర, స్థానిక పోలీస్ బలగాలు

కాసిపేట, మే 6 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం కాసిపేట మండలంలోని దేవాపూర్ ఆటో స్టాండ్ మీదుగా కాలనీల్లో సీఏపీఎఫ్ బలగాలతో పాటు స్థానిక పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, సీఏపీఎఫ్ బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారంలో సాయుధ బలగాల కవాతు

జన్నారం, మే 6 : ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ లక్సెట్టిపేట సీఐ నరేందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజవర్ధన్, సాయుధ బలగాలు పాల్గొన్నారు.

జన్నారం : మండల కేంద్రంలో కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

గుడుంబా అమ్మితే చర్యలు

నాటుసారా విక్రయిస్తూ పట్టుబడిన ఎక్సైజ్, ప్రొహిబిషన్ సిబ్బంది

రెబ్బెన, మే 6 : గ్రామాల్లో గుడుంబా తయారు చేసిన, అమ్మిన కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దీపక్ హెచ్చరించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ ఆదేశాల మేరకు సోమవారం తక్కలపల్లి, కొత్తగూడ, తుంగెడ గ్రామాల్లో తనిఖీలు చేసి బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటుసారా అమ్ముతూ పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

గొడుగులు పంపిణీ చేస్తున్న స్పర్శ ఫౌండేషన్, మిల్లు ప్రతినిధులు

కాగజ్‌నగర్, మే 6 : కాగజ్‌నగర్‌లోని ప్రధాన మార్కెట్ ప్రాంతంలో స్పర్శ ఫౌండేషన్, సిర్పూర్ పేపర్ మిల్లు తరఫున ఎండలో కూరగాయలు విక్రయిస్తున్న చిరు వ్యాపారులకు సోమవారం గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పేపర్ మిల్లు ప్రతినిధులు తుమ్మ రమేశ్, నాగేశ్వర్ రావు, స్పర్శ ఫౌండేషన్ మేనేజర్ రీణాబివాల్, అశోక్, సుందరం, సుశీల పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

ఎన్నికైన కార్యవర్గం

దండేపల్లి, మే 6 : దండేపల్లి బీఆర్ఎస్ గ్రామ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బొమ్మెన మహేశ్, అధ్యక్షుడిగా అల్లంల సంతోష్, ఉపాధ్యక్షుడిగా ఎండీ ఖాజా, అల్వాల సత్యం, ప్రధాన కార్యదర్శిగా వేముల లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా వేమునూరి లక్ష్మి, నారాయణ, కోశాధికారిగా అరిగెల సురేశ్, ప్రధాన సలహాదారులుగా మేడవేణి సత్తన్న, టేకుమట్ల చంద్రయ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అనిల్, సొసైటీ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, గోళ్ల రాజమల్లు, గొట్ల భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోస్టల్ ఓటింగ్

ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్

ఆసిఫాబాద్ టౌన్,మే 6: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లా కేంద్రంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయంలో సోమవారం డీపీఆర్వో సంపత్, తహసీల్దార్ దేశ్‌పాండే శ్రీనివాస రావు, తదితరులు తమ ఓటును బ్యాలెట్ పేపర్ ద్వారా వినియోగించుకున్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

సిర్పూర్(టీ), మే 6 : మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సోమవారం డీఎల్పీవో సురేశ్‌బాబు, ఎంపీడీవో సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం అచ్చల్లి గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో కృష్ణ మూర్తి, సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో సురేశ్‌బాబు